# ఎలాగ మారిపోవద్దు



సి. ఆనందారామం

అనామిక

గూడెంలో చిన్నా పెద్దా అందరూ రచ్చబండ దగ్గర మూగారు. ఏదో గలాటా జరుగుతోంది. గట్టిగా గొంతుకలూ, కేకలూ వినిపిస్తున్నాయి. ఆడవాళ్ళలో కొందరు వాదిస్తున్నారు.

'మళ్ళీ ఏదో గొడవ' అనుకుంది సరోజిని ... వాళ్ళలో వాళ్ళకు అప్పుడప్పుడు ఏదో తగాదా రావటమూ, రచ్చబండ దగ్గర చేరి పెద్దద్వారా తగవు పరిష్కరించుకోవటమూ వాళ్ళకు మామూలే. ఈసారి సరోజినీని ఆశ్చర్యపరిచింది రచ్చబండ దగ్గర చేరిన జనసమూహం - గూడెం గూడెం అంతా అక్కడే ఉంది, ఆడవాళ్ళు పిల్లలూ కూడా వున్నారు. సాధారణంగా తగవుకు సంబంధించిన వాళ్ళు, మరి కొందరు పెద్ద మనుష్యులూ మాత్రమే వుంటారు.

కొంచెం దగ్గరగా వెళ్ళి అంతమంది మధ్య దోషిలా తల వాల్చుకు నిలబడ్డ వ్యక్తిని చూసి నిర్ఘాంత పోయింది సరోజిని-అతడు అగ్గిదొర—

అగ్గిదొర అతని అసలుపేరు కాదు- గూడెంఅంతా కలిసి అతని స్వభావాన్ని బట్టిభయ గౌరవాలతో పెట్టుకున్న పేరు. గూడెం పెద్ద అగ్గిదొర- గూడెంలో వాళ్ళది అదొకకట్టు. వాళ్ళకు పెద్ద అంటే మహారాజే। మామూలు మురికి ధోవతి, పైన చొక్కా, ఆకుచెప్పులు - అవతారం ఇదే అయినా అధికారం మాత్రం రాజాధిరాజుదే। అతని మాటకు అడ్డులేదు- అతని తీర్పుకు ఎదురులేదు- అతనిమాట కాదని ఆ గూడెంలో ఎవరూ బ్రతకలేరు. అతని శాసనం అలాటి చండశాసనం - అందుకే అగ్గిదొర అయ్యాడు -

అలాంటి అగ్గిదొర ఈనాడు నలుగురిముందు తలవంచుకు నిలబడ్డాడు - కొందరు ఏదేదో మాట్లాడుతున్నారు-కానీ అసలు విషయం అర్థం కావటంలేదు - అంతలో సరోజిని దృష్టి అక్కడున్న మరో వ్యక్తిమీద పడింది. ఆవిడ సుమారు ఇరవై యేళ్ళలోపు యువతి - గూడెం మనిషిలా లేదు-వేషంలో కొద్దిపాటి నాగరికత వుంది-గూడెం మనిషిలా చీర పైకి కట్టుకోలేదు-నడుంమీద వెండి వడ్డాణంలేదు-జుట్టు ముడివేసుకోలేదు-పరికిణీ ఓణీ వేసుకుంది. రెండు జడలు-మెడలో ఏదో పూసలదండ .... వేషంలోవున్న నాగరికత మొహంలో కనపడటం లేదు. పనిపాటలు చేసుకునే కూలిజనానికి చెందిన మనిషని స్పష్టంగా తెలుస్తోంది.

సరోజినికి గూడెంలో ఆడవాళ్ళందరినీ తెలుసు-అక్కడ టీచర్‌గా ఆవిడ పసి పిల్లలకు పాఠాలు చెప్పటం మాత్రమే కాదు-ఇంటింటికీ వెళ్ళి పిల్లలను బడికి పిలుచుకు రావడంకూడా ఆవిడ కార్యక్రమంలో ఒక భాగం. ఆ సందర్భంలో పాపం ఆవిడ చచ్చి

నట్లు గూడెంలో ఆడవాళ్ళను బ్రతిమాలి బ్రతిమాలి వాళ్ళ పిల్లలను బడికి తీసి కెళ్ళవలసి వచ్చేది.

ఆ గుంపులో ఒకావిడిని పిలిచి "ఏయ్! మాలక్ష్మి! ఏం జరిగిందే? మీ పెద్దనే విచారణ చేస్తున్నారెందుకూ?" అని అడిగింది.

ఆ మాలక్ష్మి ముఖం వికారంగా చేసుకుని కాండ్రించి ఉమ్మి "ఇంకా ఆదేం పెద్ద? బోడి పెద్ద" అంది.

పెద్ద పేరు చెపితినే గజగజ వణుకు తారు పెద్ద పెద్ద మొగవాళ్ళుకూడా.... అలాంటిది ఒక ఆడమనిషి ఇలా మాట్లాడుతోంది.

"ఏం చేసాడు వివరంగా చెప్పు."

"ఇంకా ఏటి సెయ్యాలమ్మా! కట్టు దప్పినాడు - దాన్నెవతెనో తీసుకొచ్చి యింట్లో బెడతాడంట! ఏమయిపోవాల రత్తాలమ్మ?"

అదాసంగతి! బస్తీపిల్లలా కనపడు తోన్న ఆ మనిషిని అగ్గిదొర తీసుకొచ్చా డన్నమాట!

ఆపిల్లని అగ్గిదొర తీసుకురావటంలో విచిత్రమేమీ కనబడలేదు సరోజినికి-ఆ విషయాన్ని గూడెమంతా ఇంతతీవ్రంగా నిరసించటం-పెద్దనేదోషిగా నిలబెట్టడం మాత్రమే విచిత్రంగా తోచాయి.

రత్తాలమ్మ అగ్గిదొర భార్య అని సరోజినికి తెలుసు - ఎప్పుడూ మూలు గుతూ మంచంలోపడుకునే రత్తాలమ్మతో సరోజిని ఎక్కువగా ఏది మాట్లాడలేదు- రత్తాలమ్మకి ఆరుగురు పిల్లలు-ఏదో కాన్పులో జబ్బుచేసి మంచమెక్కింది. ఇంటిపనంతా పెద్దకూతురు చూస్తూ వుంటుంది. మూడొంతులు మంచంలోనే మూలుగుతూ పడి వుంటుందిరత్తాలమ్మ. ఒకప్పుడు అందంగా వుండేదామే! కానీ ఈనాడు అస్థిపంజరంలా తయారయింది. కళ్ళు లోతుకుపోయి గుంటలు పడ్డాయి. దవడలు కొద్దిగా వేలాడుతున్నాయి. స్నానపానాదులు సరిగ్గా లేకపోవటంతో పాటు అనారోగ్యంతో మనిషిదగ్గిర దుర్గంధం—

అగ్గిదొర పూలరంగడిలా ఉంటాడు- కాయకష్టంచేసే శరీరం బలిష్టంగాఉంది. వయసు ఎంతో కాని సడలని యవ్వనంలో కనిపిస్తాడు-ఈ సందర్భంలో అగ్గిదొర మరొకదాన్ని తెచ్చుకోవటంలో ఆశ్చర్య మేముందీ?

అయితే ఈ విషయం గూడెం ఇంతగా నిరసిస్తోందా? నీతినియమాలు ఇంత దృఢంగా ఉన్నాయా, ఈ వెనుక బడిన వర్గంలో—కుతూహలంగాపెద్దల మాటలు వినసాగింది—

"అదేవర్రి! దాన్ని మనమద్దినపెడ తావేంటి? పెళ్ళామయితాది అది? గూడెం బయట గుడిసేసి ఉంచుకో! ఒకళ్ళనేటి? పదిమందిని ఉంచుకో! ఎవడొద్దన్నాడు? నువ్వూ యెల్లిరా! నీలాగా అందరూ యెల్తారు ఆడికి. ఊరి

సొత్తు ఇట్టాంటి ఆడాళ్లు —అంతే గాని పెళ్ళాంతోపాటు ఇంట ఉంచుతావు ? సిగ్గింత లేదయ్యా ! ఛూ....!"

ఈ మాటలు విన్న ఆ పిల్లరోషంతో బుసలు కొట్టింది. మొహం చిన్న బుచ్చుకొని అగ్గిదొర వేపు చూసి "నేను పోతున్నా !" అంది.

అంతటి అగ్గిదొర మాట్లాడ లేదు. గూడెంలో ఆడంగులు మాత్రం కోపంగా "పోయేలంజ"అన్నారుకసిగా - కొందరు గొల్లున నవ్వారు. మరికొందరు ఈలలు వేసారు.

ఆ పిల్ల కన్నీళ్ళతో అక్కడి నుంచి కదిలి పోయింది. విస్తుపోయింది సరోజిని. వీళ్ళు పాపపుణ్యాలు, నీతి నియమాలు, మంచి చెడ్డలు, ఇలాంటిమాటలే మాట్లాడలేదు. కానీ ఎంత చక్కగా తీర్పు చెప్పారు ! అగ్గిదొర చేస్తున్నది తప్పని అనలేదు. కానీ ఆ పిల్లని భార్యతో సమానంగా ఉండ నియ్యలేదు. అది ఆచారంకాదు. తమ కట్టుకు విరుద్ధం.... అంతే - తెలుసు వీళ్లకి ! భార్య కాని మనిషి ఊరిబయట ఉండ వలసిందే.

వ్యభిచారం తప్పనటం లేదు – తమ సంఘపు కట్టుబాటు దాటడానికి వీల్లేదంటున్నారు – రోగిష్టి రత్తాలు నిశ్చింతగా తన కుక్కిమంచంలో పడుకుంది మూలుగుతూ .....

అగ్గిదొర కోపంతోఆరోజు ఇంటికి రాలేదు-అయినా రత్తాలమ్మ బాధపడలేదు-ఇంటికిరాక ఏమవుతాడు ? ఇవ్వాళ కాకపోతే రేపొస్తాడు-ఈ ఇల్లు తనది ! ఈ పిల్లలు తన వాళు, ఇది తన సామ్రాజ్యం.

జరిగింది తలుచుకొంటున్న కొద్దీ సరోజినిమనసులో చెప్పరానంత బాధగా వుంది.

తన దురదృష్టంకొద్దీ వాళ్ళ మధ్యకు వచ్చి పడ్డాననుకునేది.... రెండు రోజుల కొకసారిగాని స్నానం చెయ్యకపోవటం, ...తలల్లో పేలు చూసుకోవటం .... నోట్లో తాంబూలం నములటం.... ఇలాటి అలవాట్లన్నీ అసహ్యించుకునేది — మనుష్యులలో మొరటుతనం భరించలేకపోయేది - చదువు మీద ఏ మాత్రం శ్రద్ధలేని ఆ అజ్ఞానాన్ని చీదరించుకునేది। "వీళ్లు మృగాలు"అనుకుంది ఎన్నోసార్లు మనసులో ....

కానీ తాను ఏసమాజంలో నుండి వచ్చిందో। ఆ సమాజం ఎలాంటిది ?

సరోజిని చదువుకున్నది. అందమైనది బుద్ధిమంతురాలు - తండ్రి పదివేలు కట్నంతో ప్రభాకరరావుకిచ్చి పెళ్ళిచేసాడు- రతీమన్మధుల్లా వున్నారని అందరు పొగిడారు-సరోజినిఅదృష్టాన్ని చూసి ఎందరో ఈర్ష్యపడ్డారు – సరోజిని కూడా తన అదృష్టాన్ని చూచుకుని ఎంతో ఆనందించింది. అయితే ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు – ప్రభాకరరావు, మరో వన్నెల విసన

క[్రతోబతకలిపాదు-బాహాటంగా ఇంటికే తీసుకొచ్చాదు—

భరించలేక పోయింది సరోజిని -

"ఆవిడని ఇంట్లో ఉంచితే నేను ఉండను" అంటి తిరగబడి - సరోజిని కోపాన్ని కాని, ఆవేదననుకాని [్రభాకరరావు ఏ మాత్రం లక్ష్యపెట్టలేదు -

"పోతే, పో!" అన్నాడు విసుగ్గా. భరింపరాని దుఃఖం వచ్చింది సరోజినికి_గుండెలు పగిలేలా ఏడ్చింది. అంత మాట అనిపించుకున్నాక అక్కడ ఇంకా ఎలా ఉండగలదు? బయలుదేరి పుట్టింటి కొచ్చింది. పుటింటిలో ఒక్కరుకూడా సరోజిని ఆవేదనను అర్థంచేసుకోలేదు - సరిగా ఆదరించలేదు.

"మొగాళ్ళు ఏదో కక్కుర్తి పడతారు_నువ్వుకూడా ఇలా తొందరపడి ఇల్లొదిలొస్తే ఎంత అప్రతిష్ట? ఇంకా పెళ్ళికావలసిన చెల్లెళ్లున్నారు నీకు!" అంది తల్లి మెత్త మెత్తగా.

"ఏదో నాలుగురోజులుండు నేనువ్యవహారాలు చక్క బరుస్తాను_" అన్నాడు తండ్రి ధైర్యం చెపుతున్నట్లుగానే, అక్కడ ఎక్కువరోజులు వుండకూడదని హెచ్చరిస్తూ.

సరోజనిని చూడగానే వదిన గుండె గతుక్కుమంది. ఇక జీవితాంతమూ ఆడబిడ్డను తామే భరించవలసి వస్తుందేమోనని భయం బయలుదేరింది.


"వేలకు వేలు కట్నాలు గుమ్మరించి పెళ్ళిళ్ళు చేసింది చాలక ఇదొకటి! తమ ఇంట్లో తాము నిభాయించుకోలేరు కాని, పుట్టిళ్ళకొచ్చి వదినలమీద పెత్తనాలు చెలాయిస్తారు. అయినా మొగాణ్ణి కట్టేసుకునే నేర్పు ఆడదానికుండాలి! ఏ లోపమూ లేకపోతే ఇల్లాల్ని వొదిలి బజారున ఎందుకు పడతాడు? -ఇలాంటి సూటిపోటి మాటలు మితిమీరిపోయాయి.

అక్కడ ఎక్కువ రోజులు ఉండలేకపోయింది సరోజని. ఎవరికీ తెలియకుండా ఉద్యోగం చూసుకుని వచ్చేసింది. అయినా సరోజినిని సమస్యలు వదలలేదు. ఎక్కడికి కెళ్ళినా ఒకటే ప్రశ్న? - ఒక్కదానివే ఉన్నావేం? మొగుడెందుకు వొదిలేసాడు? నువ్వే వదిలేసావా? అతడే వొదిలేసాడా?" లాటిది—

ఈ ప్రశ్నలను వెన్నంటి అనుమానపు చూపులు_వంకర నవ్వులు .... వ్యంగ్య వాగ్బాణాలు....

ఇదంతా భరించలేక మారుమూల గూడెంలో చిన్న బళ్ళోకి ఒకేఒక టీచర్‌గా వచ్చేసింది సరోజిని .... గూడెంలో అందరూ సరోజినిని వింతగా చూసేవారు ..ఆవిడను ఏదైనా ప్రశ్నించటానికి వాళ్ళకు సాహసం వుండేదికాదు. అక్కడ ఒకవిధంగా ప్రశాంతంగా రోజులు వెళ్ళదీస్తోంది సరోజిని.

స్కూల్లో పిల్లలందరిలో తెలివైన




వాడు వర్సింహులు — చదువులోకూడా వాడికే శ్రద్ధ ఎక్కువ.

“నువ్వు బాగా చదువుకోవాలి! మాలాగా మారిపోవాలి” అనేది సరోజిని వాడిని పొగుడుతూ...ఆ మాటలకువాడు పొంగిపోయేవాడు....

ఎప్పటిలా ఆరోజుకూడా వాడు లెక్కలన్నీ కరెక్టుగా చేసాడు—

“చాలా బాగా చేసావురా! నువ్వు చాలా పైకొస్తావు” అని మెచ్చుకొంది సరోజిని.

“బాగా చదువుకుని నేను మీలామారి పోతాను టీచరమ్మగారు!” అన్నాడు వాడు సంబరంగా

“వద్దురా! వద్దు! బాగా చదువుకో! వృద్ధిలోకి రా! కానీ మాలాగ మాత్రం మారిపోవద్దు-మీలాగనే ఉండు-” అంది సరోజిని-

టీచరమ్మ కళ్ళలో కన్నీళ్ళెందుకొచ్చాయో. పసివాడైన వర్సింహులికి అర్థంకాలేదు.